

# నడుస్తున్న చరిత్ర

ఎం. వీరేశ్వరరావు

"ఏం బామ్మర్దీ, ఎక్కడికి పోయావు? కనపడ్డం మానేశావు?" నవ్వుతూ పలకరించాడు ప్రెసిడెంట్ (మాజీ) మంగపతి

"అదే బావా ఎన్నికలుకదా పదిహేను రోజుల్లో. గాలి ఎలా వుందో చూద్దామని వెళ్ళాను."

"ఎలా ఉందేటి?" అడిగాడు మంగపతి లంకపొగాకుచుట్ట నోట్లో పెట్టుకుంటూ.

"గాలి కొద్దిగా మారింది. రంగన్న కొడుకు లేడూ. ఎస్.వి. వాడు పట్నంలో చదివి వచ్చాడు. ఊళ్ళో కుర్రాళ్ళని మధ్యవయసువాళ్ళని రెచ్చగొడుతున్నాడు. మీరు ఇంతవరకూ ఏమీ చేయలేదట. గ్రాంట్లు భోంచేశారట. మీరు మళ్ళీ ప్రెసిడెంట్ అయితే ఊళ్ళు పాలెం ఎదుగుబొదుగు లేకుండా గొడ్రాలి కోకలా ఉంటుందని ప్రచారం చేస్తున్నాడు."

"అలాగా? మరి ఎన్నికల టైములో డబ్బు, నాటుసారా ఇదంతా పెడతావేవ

కాదా నా తప్పు."

"అదెలా అవుతుందండీ? తమరు ఈసారి జాగ్రత్త పడాలి."

"ఈసారి ఆయన అవ్వకపోవడమే మంచిది." అంది అప్పుడే అక్కడికి వచ్చి వాళ్ళమాటలు విన్న మంగపతి భార్య ఆదిలక్ష్మి.

"నువ్వు లోపలికి వెళ్ళవే. పెద్ద మనుషుల విషయాల్లో కలగచేసుకుంటావు" గద్దించాడు మంగపతి.

"హూఁ" అంటూ ఆవిడ లోపలికి వెళ్ళింది.

"అయితే ఏం చేద్దామంటావు బావమరిదీ?"

"నువ్వే ఆలోచించు" అన్నాడు మంగపతి బావమరిది.

"చూస్తా- చూస్తా-"

* * *

"ఈసారి ఎవరికీ వెయ్యద్దు అంటాడు ఓటు ఆ కుర్రాడు. అదెలా?" అన్నాడు ముసలి మహేశ

"నీకు తెల్వదా దాన్నే బాయ్‌కాట్ అంటారట దెబ్బతో ప్రభుత్వానికి తెలిసొస్తుంది" అన్నాడు ప్రక్కన ఉన్న వెంకట్రావు.

మైకులో ఎవరివో మాటలు వినపడటంతో అటు తలత్రిప్పాడు వెంకట్రావు.

"మీరిలా ఎదుగుబొదుగు లేకుండా ఉండడానికి, నడవడానికి రోడ్డయినా లేకపోవడానికి కారణం ఎవరు? ఆలోచించండి. ఈసారి ఎవరికీ వోటు వెయ్యద్దు. స్వార్థ రాజకీయాలకి మీరు బలి కావద్దు" అంటూ గంభీరంగా ఉపన్యసిస్తున్నాడు రంగన్న కొడుకు చైతన్య.

చప్పట్లు మ్రోగాయి.

* * *

"బావా బావా" హడావిడిగా వచ్చాడు ప్రెసిడెంట్ బావమరిది.

"ఏందిరోయ్!"

"ఈ కొత్త విషయం విన్నావా? ఎవరికీ ఓటు వేయకుండా 'బాయ్‌కాట్' చేయమంటున్నాడు రంగన్న కొడుకు."

"బాయ్‌కాట్ అదేటి?"

"అంటే ప్రజలు ఎవరికీ ఓటు వెయ్యరు ఎవరూ ప్రెసిడెంట్ కారు."

"లాభంలేదు. ఏదోటి చెయ్యాలి" అని లంకపొగాకు చుట్ట ముట్టించి దీర్ఘాలోచనలో పడ్డాడు మంగపతి.

* * *

ఎన్నికలు ఇంకా నాలుగురోజులు ఉన్నాయి.

ఆరోజు...

సూర్యుడు తన పనులు ముగించుకొని పశ్చిమాద్రికి జారిపోయాడు. సంధ్యకాంత నల్లచీర కట్టుకుంటోంది.

సరిగ్గా అదే సమయంలో...

గూడెంలో వంద గుడిసెలు అగ్నిదేవుడికి ఆహుతి అయ్యాయి!

మర్నాడు ప్రొద్దున్న-

ప్రెసిడెంట్ మంగపతి వచ్చి ఆందోళన వ్యక్తపరిచాడు. అగ్నిబాధితులను స్వయంగా ఓదార్చాడు. వెంటనే బాధితులకు గుడిసెలు వేసుకోవడానికి తలా అయిదువందల రూపాయలు ప్రకటించాడు. మూడురోజులు వాళ్ళకి అన్నసంతర్పణ చేశాడు. ఇది జరిగినప్పుడు చైతన్య అర్జెంటు పనిమీద ఊరెళ్ళాడు.

ఎన్నికల తేదీ వచ్చింది. చైతన్య మాట ఎవరూ వినటంలేదు.

"నా మాట వినండి. మంగపతి నక్కజిత్తులు ఇవి. మీరు ఓటు వెయ్యొద్దు," అందరికీ చైతన్య ఈ మాట చెప్తున్నాడు! విసుగెత్తిన చైతన్య "ఛీ" అనుకుంటూ కూళ్ళపాలెం వదిలి పట్నంవైపు వెళ్తున్నాడు.

తిరుగులేని మెజారిటీతో మంగపతి ప్రెసిడెంట్ అయ్యాడు.

• • •

"బావా! నీ తెలివి అమోఘం. నువ్వు అసెంబ్లీలో ఉండాల్సినోడివి" అన్నాడు అభినందిస్తూ.

"అంతే కదా మరి" నవ్వుతుంటున్నాడు మంగపతి. అది తరతరాల ప్రజల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని చూసి నవ్వుతున్నట్టుంది. *


